

సౌత్ జోన్ పోటీలకు రాజు ఎంపిక

ప్రజాశక్తి - కడప



నేషనల్ జోనల్ క్రికెట్ ఛాంపియన్స్ టోర్నమెంటుకు కడప జిల్లా నుంచి బి. రాజు సౌత్ జోన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 26 నుంచి 30 వరకు భువనేశ్వర్‌లో నేషనల్ జోనల్ క్రికెట్ ఛాంపియన్ షిప్ డెఫ్ టోర్నమెంట్ నిర్వ హించ నున్నారు. ఈ నేషనల్ జోనల్ క్రికెట్ ఛాంపియన్స్ టోర్నమెంటుకు రాజు ఎంపిక య్యారు. ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్‌ను నిర్వహి స్తోంది. ఒడిస్సా డెఫ్ క్రికెట్ అసోసియేషన్ వారు ఈ టోర్నీని హోస్టింగ్ చేస్తున్నారు. సౌత్ జోన్‌కు రాజు ఎంపిక చేయడం పట్ల కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

ఎన్నాళ్లీ నిరీక్షణ?

- రేషన్ కార్డుల మంజూరుకు మోక్షం ఎప్పుడో
- ఈనెల, రేపు నెల అంటూ దాటేస్తున్న ప్రభుత్వం
- సచివాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హతకు రేషన్ కార్డ్ ప్రామాణికంగా చేర్చారు. కానీ కొత్త రేషన్ కార్డ్ కోసం ఎన్నాళ్లు నిరీక్షించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తారని ప్రజలు అనుకున్నారు. కానీ అది జరగలేదు, సంక్రాంతి పండుగకు కొత్త రేషన్ కార్డ్ ఇస్తారని ఆశ కూడా నిరాశ అయింది. మంత్రులు మాత్రం ఈనెల ఇస్తాం.. రేపు నెల ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారే ప్రక్రియ ఇంతవరకు చేపట్టలేదు.

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్ కార్డుల కోసం నిరుపేద కుటుంబాలు ఎదురు చూపులు చూస్తున్నారు. వైసిపి అధికారంలో ఉండగా పులివెందుల నియోజకవర్గం పరిధిలో తూతూ మంత్రంగా కొంత మందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల చేత రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగలేదు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల తరువాత కొత్తకార్డులు ఇస్తామని చెబుతూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ కార్డు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకనుగుణంగా కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు చేర్పులు మార్పులకు అవకాశమిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్ ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతుంది. విషయం తెలియని ప్రజలు రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. 2023 నుంచి నూతనంగా వివాహాలు చేసుకున్నవారు తప్పు ఒప్పులు, మార్పులు చేర్పులు, నూతనగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతో మంది రేషన్ కార్డు లేక తంటాలు పడుతున్నారు. ఆరోగ్యం సరిగా లేనివారికి ఆరోగ్యశ్రీ రాక సిఎం రిలీఫ్ ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలుగా ఉన్నారు. అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తవి కోరుతూ మండల, ఆర్‌డిఒ, జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లలో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డులు చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో అటు తహశీల్దారు, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, త్వరలో ప్రకటన వస్తుం దని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సమస్యను గుర్తించి రేషన్ కార్డు మం జూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం

నాకు నాలుగేళ్ల కిందట వివాహమైంది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. రోజూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. రేషన్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. ఆత్యవసర వైద్యసేవలు పొందాలన్నా ఆరోగ్యశ్రీ లేదు. ప్రభుత్వ అధికారులు తమ గోడు పట్టించుకుని రేషన్ కార్డు మంజూరు చేయాలి.

-లక్ష్మీదేవి, కూలీ, పులివెందుల.

కాళ్లరిగేలా తిరుగుతున్నా

సుమారు ఐదేళ్ల కిందట వివాహం అయింది. నాకు ఇద్దరు సంతానం. రోజువారి కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రేషన్‌కార్డు కోసం అన్ని చోట్ల తిరుగుతున్నాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు రేషన్ కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి.

- మమత, పులివెందుల

సైట్ ఓపెన్ కాగానే కార్డులు మంజూరు చేస్తాం

రేషన్ కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే రేషన్‌కార్డులకు సంబంధించిన సైట్ ఓపెన్ కావడం లేదు. కార్డులకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తాం. ఈ క్రమంలో అప్డేట్ జరగ్గగానే అర్హులను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.

- చిన్నయ్య, ఆర్‌డిఒ, పులివెందుల

బి.నారాయణరెడ్డికి సిపిఎంకు సంబంధం లేదు

-కబ్జాలుచేస్తే విచారించి చర్యలు తీసుకోండి

- సిపిఎం జిల్లా కమిటీ వెల్లడి

ప్రజాశక్తి -కడప అర్బన్

బి.నారాయణరెడ్డికి, సిపిఎంకు సంబంధంలేదని, కబ్జాలు చేస్తే విచారించి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ దినపత్రికలో ఈనెల 3, 18 తేదీల్లో ప్రస్తుతం సిపిఎం సభ్యుడు కానీ బి.నారాయణ రెడ్డిపై, వారి కుటుంబ సభ్యులభూకబ్జాలపై కథనాలు ప్రచురించారని పేర్కొన్నారు. 2023 నుంచి బి.నారాయణ రెడ్డికి పార్టీ ప్రాథమిక సభ్యత్వం లేదని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ వివరణలు తీసుకోకుండా రాశారని చెప్పారు. సిపిఎం పద్ధతులకు భిన్నంగా వ్యవహరించిన వారిని కడప జిల్లాలో సిపిఎం జిల్లా కార్యదర్శులను, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులను, జిల్లా కమిటీ సభ్యులను, పూర్తి కాలం కార్యకర్తలను కూడా బహిష్కరించిన ఉదాంతాలు గతంలో చాలా ఉన్నాయని పేర్కొన్నారు. సిపిఎం క్రమశిక్షణ కలిగిన పార్టీ అని గుర్తు చేశారు. నగర పరిధిలోని, భగత్ సింగ్ కాలనీ సిపిఎం నాయకత్వంలో ప్రజల భూ పోరాటం ద్వారా నిర్మితమైన కాలనీ అన్నారు. నెలల తరబడి సిపిఎం కార్యకర్తలు జైలల్లోనే మగ్గితే ప్రజలకు ఆ కాలనీ అభివృద్ధి అయిందని గుర్తు చేశారు. భగత్ సింగ్ కాలనీ, చెమ్ముమియాపేట రెవెన్యూ భూమి సర్వే నెంబర్ 344 లో, స్కూలు దక్షిణ భాగంలో ఉన్న స్థలాన్ని కడప కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ 2017 లో సిపిఎం కడప జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు, సుందరయ్య స్మారక్ కేంద్రం లైబ్రరీకి కేటాయిస్తూ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. సదరు స్థలాన్ని కబ్జా కోర్లు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిన వెంటనే, ఆ విషయం ఈనెల 2న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారని, దానివల్లనే సదరు స్థలంలో ప్రభుత్వ కార్పొరేషన్ స్థలంగా హెచ్చరిక బోర్డు వేయించారని చెప్పారు. కడప భగత్‌సింగ్ కాలనీలోని కమ్యూనిటీ స్థలాన్ని అధికారులు, స్థానిక ప్రజల అభీష్టం మేరకు దాని కమ్యూనిటీ లైబ్రరీగా మార్చాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. బి.నారాయణ రెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు పట్టా ఎలా వచ్చిందో విచారించి చర్యలు తీసుకోవాలని సిపిఎం కోరుతోందన్నారు. బి.నారాయణ రెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు స్థలం తీసుకోమని సిపిఎం ఏనాడు చెప్పలేదని, బి.నారాయణ రెడ్డి భార్య పేరుతో పట్టా ఎలా వచ్చిందో విచారించి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ కోరుతోందన్నారు. ఆ విధంగా ఏ పార్టీ నాయకునికి తీసుకోమని చెప్పదని తెలిపారు. సాధారణ ప్రజల జీవన విధానాన్ని పార్టీ సభ్యులు అలవర్చుకోవాలని నిరంతరం సిపిఎం చెప్తూ ఉంటుందని పేర్కొన్నారు. సిపిఎం నాయకులు ప్రజల తరపున పోరాడే వారే తప్ప సొంతానికి ప్రభుత్వ ఆస్తులు కబ్జా చేయరని చెప్పారు. అలా ఎవరైనా ఆక్రమణ లకు పాల్పడితే వారి పైన క్రమశిక్షణ చర్యలు తీసుకుని పార్టీ నుంచి తొలగిస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, వి.అన్వేష్, కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి : డివైఎఫ్ఐ



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న

ప్రజాశక్తి - బద్వేలు

సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమలో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రక్రియ చేపట్టాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తెలిపారు. పిపి కుంట వద్ద ఉన్న సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమను డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువత చాలామంది ఉన్నారని, ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి పరిశ్రమలు లేక వలసల బాట పడుతున్నారని తెలిపారు. పరిశ్రమలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వ నిభందనలు సైతం పరిశ్రమ యాజమాన్యం బేఖాతరు చేస్తున్నారని అన్నారు. ఉపాధి పరిశ్రమలు స్థానికంగా వస్తే స్థానికంగా నివాసం ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశించిన నివాసం ఉంటున్న వారికి ప్రాధాన్యత ఇవ్వడంలో పరిశ్రమ నిర్వాహకులు ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక పరిశ్రమలో స్థానిక యువతకు అవకాలు ఇచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్.కె. ఆదిల్, మహిళా జిల్లా కన్వీనర్ సి.గురుదేవి, పట్టణ నాయకులు యువరాజ్ ,నరసింహ, సుధాకర్ పాల్గొన్నారు.



కబ్జా భూమిని పరిశీలిస్తున్న బద్వేల్ ఆర్‌డిఓ చంద్రమోహన్

భూ కబ్జాలపై ఆర్‌డిఓ విచారణ

ప్రజాశక్తి- కాశినాయన

మండల పరిధిలోని నాయనపల్లె గ్రామ పొలంలో కొండ పోరంబోకు కబ్జా అయిన విషయం తెలుసుకొని శుక్రవారం బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు గ్రామ పొలంలో 128 129 130 సర్వే నెంబర్లలో దాదాపు 500 ఎకరాల పై చిలుకు భూమి ఉంది. అందులో వరికుంట్ల గ్రామానికి చెందిన కొంతమంది భూకబ్జాదారులు వైసిపి ప్రభుత్వ హయాంలో ఉన్నప్పుడు ఇష్టారాజ్యంగా కబ్జా చేసినట్లు పలువురు ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. కొండ పోరంబోకు భూమిని చదును చేసి బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుని అరటితోటలు సాగు చేసిన విషయంపై ఆర్‌డిఒ ఆరా తీశారు. వెంటనే డ్రోన్ ద్వారా సర్వే సర్వే చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. పేదలు ఒక్క ఎకరా సాగు చేసుకుంటే వెంటనే అధికారులు కేసులు బనాయించి దళి తులను ఇబ్బంది పెట్టిన దాఖలాలు ఉన్నాయి. వందల ఎకరాలు భూ కబ్జాదారులు, పెత్తనం దారులు సాగు చేస్తే వారి వైపు కన్నెత్తి కూడా చూడలేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వాపోతున్నారు. భూ కబ్జాదాలపై ఎలాంటి చర్యలు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఇరిగేషన్‌లో ఇష్టారాజ్యంగా పనులు : వైసిపి

ప్రజాశక్తి - కడప: కడప ఇరిగేషన్‌లో టెండర్లు లేకుండానే ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని వైసిపి నాయకులు జయచంద్రారెడ్డి, శివ పేర్కొన్నారు. శుక్రవారం మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా టెండర్లు వేయకుండా , ఒకవేళ వేసినా బెదిరించి తన అనుచరులకు వర్కులు పంచి పెడుతున్నారని విమిర్శంచారు. ఏ ప్రభుత్వంలోనైనా ఒక పనిని చేయాలంటే న్యూస్ పేపర్లకు టెండర్ వేసేందుకు పిలుపునివ్వాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కొన్ని పనులకు సంబంధించి టెండర్లు ఎవరైనా వేస్తే బెదిరించి టిడిపికి చెందిన వారికే ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ ధనంతో విచ్చలవిడిగా బుగ్గ వంక సుందరీకరణ పేరుతో ప్రభుత్వ నిధులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీ రంజన్ రెడ్డి, ఐస్ క్రీమ్ రవి, మోత్కూరు సుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎం ట్రోఫీ 'మిట్స్' కైవసం

ప్రజాశక్తి-మదనపల్లె

కడపలోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల వారు నిర్వహించిన ప్రతిష్టాత్మక కెఎస్ఆర్ఎం ట్రోఫీ-2025ను మిట్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. అత్యుత్తమ అథ్లెటిసిజం, జట్టు కృషి, పోటీ స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, మిట్స్ విద్యార్థులు వివిధ క్రీడా ఈవెంట్లలో అగ్రస్థానాలను సాధించారని పేర్కొన్నారు. ఆ కళాశాలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ (మహిళలు), త్రోబాల్ (మహిళలు), కబడ్డీ (మహిళలు), టెన్నికాయిట్ (మహిళలు), బ్యాడ్మింటన్ (పురుషులు) పోటీలలో మొదటి స్థానంలో విజేత నిలిచి ప్రతిభ కనపరిచారని చెప్పారు. చెస్ (మహిళలు) రన్నరప్‌గా నిలిచారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యా ర్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, పిడి డాక్టర్ దామోదరన్, మంజు విక్రమ్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్ విద్యార్థులు క్రీడల ద్వారా శారీరక, మానసిక అభివృద్ధిలో చురుకుగా పాల్గొనడానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని చిన్న చౌకు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బుడ్డాయిపల్లి గ్రామ పొలం సర్వే నంబరు 496-3, 2.50 ఎకరాలలోని ప్లాట్‌లకు సంబంధించిన రాస్తాను కొంతమంది ఆక్రమించారని బాధితుడు ఎల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 వరకు రిజిస్ట్రేషన్‌లను సక్రమంగా నిర్వహించారని తెలిపారు. ఈ ఏడాది ప్లాట్‌లకు రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయడం వల్ల సమస్య ఉత్పన్నమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 88 సెంట్లు కబ్జాకు గురైందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇక్కడ రాజకీయాలకు తావు లేదని చెప్పారు. సమావేశంలో సురేష్ కుమార్ రెడ్డి, రఘురాం రెడ్డి, బుజ్జి, సిద్దయ్య, మాభున్ని, అబ్దుల్ పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న ఉదయం 8 గంటలకు కోటిరెడ్డి సర్కిల్‌లో మొబైల్ ఈ- కియోస్క్, ఈ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్ ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ మనోజ్ రెడ్డి ఒక ప్రకటన తెలిపారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఈనెల 20 నుంచి పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు తమ వద్ద ఉన్న పాత ఎలక్ట్రానిక్స్ వస్తువులు అందజేయాలని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



రామ్మోహన్‌ను సన్మానిస్తున్న ఖోఖో సంఘం నాయకులు డాక్టర్ శివబాబు

ఖోఖో క్రీడాకారుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లి గ్రామం శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కట్ల రామ్మోహన్‌కు జిల్లా ఖోఖో సంఘం, డాక్టర్ శివ బాబు ఆధ్వర్యంలో ఘన సత్కారం లభించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ రైల్వేలో క్రీడా కోట విభాగంలో ఉద్యోగం సాధించిన రామ్మోహన్‌ను మండలంలోని స్మార్ట్ వర్క్ కోచింగ్ సెంటర్, భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో శు క్రవారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శివ బాబు మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటితే ఏదైనా సాధించగలమని నిరూపించిన రామ్మోహన్‌ను ప్రతి క్రీడాకారుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 2 నుంచి 3 శాతానికి రిజర్వేషన్ పెంచడం ద్వారా ఇది నిరూపి తమైందన్నారు. దీన్ని అందరు విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కడప జిల్లా ఖో ఖో సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఆటలు ఉన్నత స్థితికి తీసుకెళ్లడంతో పాటు చదువును కూడా ప్రోత్సహిస్తుందన్నారు. ఆటలాడడం ద్వారా చదువులోనూ ముందుంటున్నారని నేటి విద్యార్థులు నిరూపించడం అభినందనీయమన్నారు. బయనపల్లి హైస్కూల్ ప్రధానో పాధ్యాయుడు దీనదయాల్, పాఠశాల కమిటీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన రిజర్వేషన్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో భారత్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫరూక్, కడప జిల్లా ఖోఖో సంఘం సంఘం ప్రతినిధులు రామ సుబ్బారెడ్డి, నరేంద్ర, లక్ష్మణ్ , రెడ్డయ్య, మల్లికార్జున, కృష్ణయ్య, రవి, సుధీర్, కొండలరావు, ఎం పవన్ కుమార్, ప్రముఖ ఫొటోగ్రాఫర్ నిత్య, హరి, సీనియర్ క్రీడాకారులు ఖలీల్‌బాషా, రెహమాన్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు, ముస్లింములు, సిబ్బంది



నేలకొరిన అరటితోట

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన అరటి, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

గాలివాన బీభత్సానికి నియోజకవర్గంలోని లింగాల, పులివెందుల, వేముల మండలాలలో భారీగా అరటి పంట నేలకొరిగింది. అలాగే పలు గ్రామాలలో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో ఆ గ్రామాలలో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి లింగాల మండలంలోని కర్ణ పాపయ్య పల్లె గ్రామంలో చెట్లు విరగడంతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. వేముల మండలం వేముల గ్రామానికి చెందిన వెంకటేష్ అనే రైతు ఆరు ఎకరాల పంట నేల కుదిరింది. చేతికి వచ్చిన పంట నేలకొరగడంతో రైతుకు కన్నీళ్లు మిగిలాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాలలో అరటితోపాటు , బొప్పాయ, మామిడి తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిలినట్లు తెలుస్తుంది. రాత్రి కావడంతో ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయడానికి అధికారులకు సమాచారం రాలేదు. ఎన్ని ఎకరాలలో ఏ పంటలు దెబ్బ తిన్నది అధికారుల పరిశీలించి అంచనా వేయనున్నారు. ఏదిఏమైనప్పటికీ ప్రకృతి వైపరీత్యాలకు రైతన్నకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

వక్ఫ్ విధ్వంసకర చట్టం

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ సవరణ చట్టం ముస్లిమ్ పాలిట విధ్వంసకర చట్టంగా తయారైందని, బిల్లుకు పార్లమెంట్‌లో చట్టంగా మారడానికి టిడిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైసిపి అధినేత వై.యస్. జగన్మోహన్ రెడ్డి పాపమేనని అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. కడప ప్రెస్ క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు కొత్త చట్టానికి అనుకూలంగా పార్లమెంటులో ఓటు వేయగా రాజ్యసభలో వైసిపి ఓట్లు వేసి ఈ పాపానికి ఒడిగట్టారని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ నల్ల చట్టాన్ని కాంగ్రెస్ పార్టీతో పాటుగా వివిధ సంస్థలు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో సుమారుగా 84 కేసులు దాఖలు చేశారన్నారు. దీనిపై రెండు రోజులపాటు ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించిన మీదట యథాతథా స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టంపై ఎన్డీఏ కూటమిలోని అన్ని రాజకీయ పార్టీలకు చెంపపెట్టులా అభివర్ణించారు. వందల ఏళ్ళ నాటి వక్ఫ్ ఆస్తులకు ఆధారం వాటి పత్రాలు ఎలా లభిస్తాయని సుప్రీంకోర్టు ప్రశ్నించినట్లు వివరించారు. ముస్లిం మైనార్టీల ద్రోహులుగా మూడు పార్టీలకు ముద్రపడినట్లు ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఈ మూడు పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గఫార్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధి అమీర్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అలీఖాన్

అనుమతుల్లేని ఫ్లెక్సీలను తొలగించాలి

- కమిషనర్‌కు అఖిలపక్ష నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో మహనీయుల విగ్రహాలకు నివాళులు అర్పించేందుకు నిచ్చెనలు ఏర్పాటు చేయాలని, అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతూ కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డికి అఖిలపక్ష కమిటీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో స్వాతంత్ర్య సమరయోధుల, వివిధ రంగాల ప్రతిభావంతుల జయంతులు, వర్ధంతి సందర్భాలలో వారిని స్మరించుకుంటూ నివాళులు అర్పించడానికి, పూలదండలు వేయటానికి, శుభ్రం చేయటానికి ఇతరత్రాలకు నిచ్చెనలు ఏర్పాటు చేయాలని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ప్రముఖ సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, తదితర విగ్రహాలకు నిచ్చెనలు ఏర్పాటు చేయకపోవడం వల్ల నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసే క్రేన్ ద్వారానే పూలదండలు వేసి నివాళులు అర్పించవలసి వస్తుందని అన్నారు. గుండె జబ్బులు, రక్తపోటు ఉన్నవారు, వయోవృద్ధులు, భయస్తులు ఈ క్రేన్ ద్వారా పూలదండ వేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది అని తెలిపారు. ఫ్లెక్సీలు వేయాలంటే నిబంధనలతో కూడిన అనుమతులు తప్పనిసరి చేయాలని కోరుతూ వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలతో ఏర్పాటు అయిన అఖిలపక్ష కమిటీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఐసిసి కో-ఆర్డినేటర్ ఎస్.ఎ.సత్తార్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు మైనుద్దీన్, హమీద్ , సిపిఐ నగర కార్యదర్శి-వెంకట శివ, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, బి ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి సగిలి గురప్ప, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రీనివాసులు, హేతువాద సంఘం కన్వీనర్-సి ఆర్.వి. ప్రసాద్, మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు-దస్తగిరి, దళిత నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న లక్ష్మిరాజా

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో తారకరామా నగర్‌లో శుక్రవారం బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ట్రెజరర్ నరసింహారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం, ఉపాధ్యాయులు ,విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు బ్యాగు బెల్టు టై ఏకరూప దుస్తులు గుడ్లు రుచికరమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలాంటి రుసుము చెల్లింపు లేకుండా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తారకరామ నగర్ ఎంపిపి పాఠశాలలో 13 మందిని చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామమూర్తి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రికవరీ సెల్ ఫోన్లు తీసుకువెళ్లండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప సైబర్ పోలీస్ వారు 6 నెలలుగా 602 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. ఇప్పటి వరకు 275 మంది బాధితులు మాత్రమే వారి ఫోన్లను ఆధారాలు చూపించి తీసుకువెళ్లారు. ఇంకా 327 మంది బాధితులు వారి మొబైల్స్ తీసుకు వెళ్ళాల్సి ఉంది. మొబైల్ ఫోన్ పోయినట్లుగా పోలీస్ స్టేషన్‌లో కంప్లెయింట్ చేసిన వారు మొబైల్‌కు సంబంధించిన ఆధారాలతో కడప సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని సంప్రదించి తీసుకుని వెళ్లాలని పోలీసు శాఖ పేర్కొంది.



దెబ్బతిన్న ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ వేస్తున్న కార్మికులు

ఎట్టకేలకు రంధ్రం పూడ్చివేత

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వనిపెంట రోడ్డు కేసీ కెనాల్ కాలువపై ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పడిన రంధ్రాన్ని ఎట్టకేలకు శుక్రవారం పూడ్చారు. ఈ రంధ్రం వల్ల ప్రయాణికులు చాలాఇబ్బందులకు గురయ్యేవారు. బ్రిడ్జి దెబ్బతిని రంధ్రం పడడంతో చాలామంది ద్విచక్ర వాహనదారులు, కారుల్లో ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దెబ్బతిన్న ప్రాంతంలో రాళ్లు, టైర్లు అడ్డం పెడుతూ ఇన్ని రోజులు కాలయాపన చేశారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. టిడిపి నాయకులు ఆకుల కృష్ణయ్య ఆధ్వర్యంలో బ్రిడ్జికి పడిన రంధ్రాన్ని తాత్కాలికంగా పూడ్చివేశారు. త్వరలో కేసీ కెనాల్ కాలువపై నూతన కల్వర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామని ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జికి ఉన్న రంధ్రానికి సిమెంటు కాంక్రీట్ వేయడంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జికి సమీపంలో అంకాలమ్మ దేవాలయం ఉంది. అంకాలమ్మ తిరుణాల ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పులివెందులలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం పులివెందల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈ-చెక్ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నియంత్రించండి.. శాస్త్రీయంగా వదిలించండి అంటూ నినదించనున్నారు. పూలంగళ్ల సర్కిల్ నుండి పార్నపల్లి రోడ్డు మీదుగా ప్రకృతి రెస్టారెంట్ వరకు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పుర ప్రజలను కోరారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు



డ్యానియెల్ వినయ్‌కుమార్

గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సిఎస్ఐ, సిఎస్ఐ(ఎస్పిజి), ఆర్‌సిఎం, మన్నా, హెబ్రోన్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎల్ఎమ్ కాంపౌండ్ సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ డ్యానియెల్ వినయ్ కుమార్, ఎస్పిజి చర్చిలో రెవరెండ్ ప్రసన్న సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గుడ్ ఫ్రైడే, శిలువ ప్రాముఖ్యత బోధించారు. ఏసుక్రీస్తు శిలువలో పలికిన మాటలను భక్తులకు వివరించారు. ఆర్‌సిఎమ్ చర్చి ఫాదర్ మరిరెడ్డి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ కూడలి వరకు వివిధ వేష ధారణాలతో సిలువ యాగం కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధు సూదనరెడ్డి ఆధ్వర్యంలో ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ, పులివెందుల రోడ్డులోని సిఎస్ఐ (ఎస్పిజి) చర్చిల్లోని క్రైస్తవులకు జ్యూస్ ఏర్పాటు చేశారు. సంఘ పెద్దలు, సంఘస్తులు, సిస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

వేంపల్లె : వేంపల్లెలో ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. బిడాలమిట్ట కల్వరీకొండ చర్చిలో ఫాస్టర్ ఎస్‌బి రవికుమార్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో అందరిని ఆకట్టుకొనేలా శిలువ యాగం కార్యక్రమం చేశారు. ఏసుక్రీస్తు పడిన కష్టాలను చూపిస్తూ భక్తులు శిలువ మోస్తూ కార్యక్రమం సాగించారు. వేంపల్లెలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఖాజీపేట : గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని క్రైస్తవులు వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు ఏసుక్రీస్తు సందేశాన్ని చదివారు. ప్రతి ఒక్కరూ శాంతి, దయ, జాలి, కరుణతో జీవించాలని సూచించారు. చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానికంగా ఉన్న ఆర్‌సిఎం సిఎస్ఐ చర్చిలలో జరిగిన ప్రత్యేకప్రార్థనల్లో పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని సిఎస్ఐ, ఆర్‌సిఎం చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప ఆధ్వర్యంలో ఆయన తండ్రి గోటూరు ఓబన్న జ్ఞాపకార్థం చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కడప : కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపవాసం ఉన్న భక్తులందరికీ చల్లని పానీయాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, సుగుణమ్మ, రోజా, రామంజీనమ్మ, కిరణ్ అనేక మంది భక్తులు పాల్గొని ప్రజలు, అధికారుల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



వేంపల్లె : శిలువ యాగం కార్యక్రమంలో భటులు, క్రీస్తు వేషధారణలు

క్రైం కార్నర్

అదుపుతప్పి కారు బోల్తా

- డ్రైవర్ మృతి, మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం



మండలంలోని నిడివెల సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. గురువారం రాత్రి సింహాద్రిపురం నుంచి పులివెందులకు బయలుదేరిన ఏపీ16 సి కె0005 నంబరు గల వాహనం నిడివెల సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో నలుగురు ప్రయాణిస్తుండగా డ్రైవర్ పాలెం వెంకట సాయి(28) అనే యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలు కావ డంతో కడప రిమ్స్‌కు తరలించారు. వీరందరూ పులివెందులకు చెందినవారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రవికుమార్ పరిశీలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ రమణ మాట్లాడుతూ అతివేగంగా కారు నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు.

అటవీ శాఖ ఇంటి దొంగల గుట్టురట్టు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మండలం వనిపెంట అటవీశాఖ పరిధిలో 2021 జనవరి 29న ఎసిబి అధికారుల తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. 49 టన్నుల ఎర్రచందనం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. అప్పటినుంచి సాగిన విచారణలో తాజాగా 15 మందిపై ఎసిబి అధికారులు అభియోగాలు నమోదు చేశారు. అప్పటి డిఎఫ్ఒ నాగార్జున రెడ్డితోపాటు 9 మంది బీట్ ఆఫీసర్లు, నలుగురు సెక్షన్ ఆఫీసర్లు, ఒక రేంజ్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్‌పై అభియోగాలు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రబీలో తగ్గిన నూగు సాగు

ప్రజాశక్తి - చాపాడు

రబీలో వేసవి పంటగా సాగు చేసే నూగు పంట ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. జనవరి రెండవ వారం నుంచి ఫిబ్రవరి వరకు రైతులు పంటను సాగు చేపట్టేవారు. ఈ ఏడాది కెసి కాలువలో నీరు ప్రవహిస్తూ ఉండడంతో దుక్కులు ఆలస్యమై సాగు నెమ్మదించింది. పంట సాగు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంట ప్రస్తుతం నెల పంట దశలో ఉంది. గతంలో మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, విశ్వనాథపురం, బద్రిపల్లి, చియ్యపాడు, సీతారామపురం, అల్లాడుపల్లె, వెంగన్నగారిపల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 500 ఎకరాల్లో రైతులు పంటను సాగు చేసేవారు. ఈ ఏడాది గతంలో కంటే సాగు తగ్గిందని తెలుస్తోంది. కెసి కాలువలో, కుందూకు కూడా నీరు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంట మే నెలలో ఎక్కువ భాగం నూర్పిడికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కెసి కెనాల్‌కు మే మెదటి వారం వరకు నీరు వస్తే నూగు పంట పండేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వేడి తీవ్రతకు పంటకు నీరు ఏక్కువగా అవసరం అవుతుందని రైతులు చెబుతున్నారు. నూగు పంట సాగుకు ఎకరాకు రూ.పదివేల లోపు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. నాలుగు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడి వస్తే వేసవిలో ఖర్చులు మిగులుతాయని రైతులు పేర్కొంటున్నారు. కెసి కెనాల్ పరిధిలో రైతులు మాత్రం ఒక తడి నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.



జడ్డిగారి కొట్టాలు వద్ద సాగులో ఉన్న నూగు పంట

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అపోహలు వీడాలి

ఎల్‌విపిఇఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శశిబిందు

ప్రజాశక్తి - కడప అర్బన్



లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అపోహలు విడనాడాలని, ఈ సర్జరీ లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్ళల్లోని కార్నియా ఒంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్ళద్దాల అవసరం లేకుండా సహాయపడే ఓ ప్రక్రియని ఎల్‌విపిఇఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శశిబిందు తెలిపారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సను సాధారణంగా మైయోపియా (హ్రస్వ దృష్టి), హైపర్‌మెట్రోపియా (దూర దృష్టి లోపం), ఆస్టిగ్మాటిజం (వక్రదృష్టి)లను సరిచేయడానికి చేయబడుతుందన్నారు. రోగి వయస్సు కనీసం 21 సంవత్సరాలు అయివుండాలని, ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగివుండాలని, అపవర్తన దోషం అతితక్కువగానూ, మితంగానూ ఉండాలని, రోగి కళ్ళు మంచి మందంగల కార్నియాలను కలిగి ఉండాలని తెలి పారు. నీటికాసులు, కెరాటోకోనస్, కంటిశుక్లం లాంటి ఇతర కంటి వ్యాధులు ఉండకూడదన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ ద్వారా 20/25, అంతకంటే మెరుగైన (కళ్ళద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయ గలిగేంత స్పష్టంగా చూడగలిగే) దృష్టిని పొం దడం, అద్దాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, చూపును త్వరిత గతిలో తిరిగి పొందడం, ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు అనేక రకాలుగా ఉన్నాయని, కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా నేత్ర వైద్యులు సూచిస్తారన్నారు. లేసిక్ (లేజర్-అసిస్టెడ్ ఇన్ సిటు కెరాటోమిలేసిస్), పిఆర్‌కె (ఫోటోరిఫ్రాక్టివ్ కెరాటెక్టమీ), స్మైల్ (స్మాల్ ఇన్సిషన్ లెంటిక్యూల్ ఎక్స్‌ట్రాక్షన్), విధానాలు ఉంటాయన్నారు. రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది ఎటువంటి నొప్పి ఉండదన్నారు. ఈ సర్జరీ ప్రక్రియలో లక్షలాది మంది సంతృప్త రోగులతో, లేసిక్ 30 సంవత్సరాలకు పైగా నిర్వహిం చబడుతోందన్నారు. ఈ చికిత్స ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు చాలా ఉన్నాయన్నారు. ఈ చికిత్స జరిగిన తర్వాత ఇకపై ఎప్పటికీ కళ్ళద్దాలు ధరించాల్సిన అవసరం ఉండ దని చెప్పారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది అం దరికీ ఒకే విధంగా పనికొచ్చే పరిష్కారం కాదని, సరైన ప్రక్రియను నిర్ణయించడానికి అనుభవనం ఉన్న నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు.

జడ్‌పి చైర్మన్లకు గన్‌మెన్‌ల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రవ్యాప్తంగా జడ్‌పి చైర్మన్లకు గన్‌మెన్‌లను తొలగించడం దారుణమని కడప జడ్‌పి చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవక తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వచ్చే జడ్‌పి నిధులతో ఎక్కడ కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మే 8న జడ్‌పి సమావేశం నిర్వహించనున్నట్లు తెలి పారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో చర్చించి మొదటి ప్రాధాన్యత తాగునీటికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశానికి కూటమి ఎమ్మెల్యేలు సమస్యలపై చర్చించకుండా గైర్హాజర్ కావడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట, వేంపల్లె, సింహాద్రిపురం, లింగాలతోపాటు ఆయా మండలాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 కోట్లు వేసవి కాలంలో తాగునీటికి ఖర్చు పెట్టుతామని వివరించారు. ఇప్పటికే వివిధ రకాల పనులకు సంబంధించి రూ.6 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్‌రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీర ప్రతాపరెడ్డి, నాయకులు భరత్ కుమార్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ రామగోవింద రెడ్డి

వైసిపిపై టిడిపి దుష్ప్రచారం విడ్డూరం



మాట్లాడుతున్న వైసిపి మండల ఉపాధ్యక్షుడు మునీర్

ప్రజాశక్తి - వేంపల్లె

వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా వైసిపి ఓటు వేసిందని టిడిపి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని వైసిపి మండల ఉపాధ్యక్షుడు మునీర్ బాషా పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిల్లుకు వ్యతిరేకంగా 95 ఓట్లు వేస్తే.. అందులో 7 ఓట్లు వైసిపి వేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వక్ఫ్ బిల్లుకు ముస్లింల వైపు వైసిపి నిలిచిందని తెలిపారు. చంద్రబాబు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఏ విధంగా వైసిపి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిందో టీడీపి నాయకులు నిరూపించాలని సవాల్ విసిరారు. పార్లమెంటు ఉభయసభలు జరుగుతుండగా ముస్లిం నాయకులతో టిడిపి సమావేశం నిర్వహించి వక్ఫ్‌కు మద్దతూ తెల్పడం న్యాయమా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుండి జగన్ వరకు ముస్లింలకు న్యాయం చేశారన్నారు. వైసిపి వల్లే ముస్లిం మైనార్టీలకు గౌరవం దక్కిందని పేర్కొన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి కేంద్ర ప్రభుత్వంతో టిడిపి నాయకులు పోరాడాలని పిలుపునిచ్చారు. సుప్రీం తీర్పు ముస్లింలకు అనుకూలంగా, సానుకూలంగా రావడానికి కూడా వైసిపినే ముఖ్య కారణమన్నారు. ఐక్యంగా ఉండేందుకు ప్రతి ముస్లిం పాటు పడాలని కోరారు. రాజ్యసభలో జరిగే ఓటింగ్‌కు ముందే వైసిపి విప్ జారీ చేసిందన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నేతలు బాబా షరీఫ్, షామీర్, మండల కో-అప్షన్ మెంబరు అసనయ్య, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, మటన్ బాబా, సేవాదళ్ అధ్యక్షుడు రఫీ, ఉమర్, రాహుల్, బండల షకూర్, హబీబుల్లా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కళాభారతి నటులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)



సత్కారం పొందిన నటులు

కళాభారతి నటులకు ప్రొద్దుటూరు కార్యవర్గ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈనెల 16న నాటక రంగ దినోత్సవ సందర్భంగా విజయవాడ తుమ్మ లపల్లి కళాక్షేత్రంలో కందుకూరి విశిష్ట పురస్కారాలు పొందిన నటులు కే.సుభాష్ చంద్రబోస్, ఆర్.సుబ్రహ్మణ్యం, చదువుల సాహిత్య వేదిక ద్వారా నటభూషణ అవార్డు పొందిన కొత్తపల్లి శీనును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఉపాధ్యక్షుడు మచ్చ నరసింహ ఆచార్య మాట్లాడుతూ కొత్తపల్లి శీను అనేక నాటకాలలో నటించి ఉత్తమ నటుడిగా రాష్ట్రస్థాయిలో అవార్డులు పొంది ప్రస్తుతం కళాభారతి కార్యదర్శిగా కూడా విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. కెవిఎస్‌సి బోస్, సుబ్రహ్మణ్యం కూడా కళాభారతి సభ్యులుగా ఉంటూ అనేక నాటకాలలో పాల్గొంటూ మంచి నటులుగా రాణిస్తూ ఉన్నారన్నారు. ఇలాంటి అవార్డులు వరించడం ఆనంద దాయకమని, వారి సేవలను కొనియాడారు. ఈ సభలో నటులు కొత్తపల్లి శీను, సుబ్రహ్మణ్యం, బోసులు వారి వారి నటన అనుభవాలను పంచుకున్నారు. సంస్థ కార్యవర్గ సభ్యులు, ఇతర కళా కారులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయాలి

వేంపల్లె : మే డేను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. శుక్రవారం మే డేకు చెందిన గోడ పత్రికలను వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులు, సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా కనుమరుగు అవుతున్నాయని ఆందోళన వ్యకం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాలాజీ, దస్తగిరి, బాబు, కృష్ణయ్య, సిద్దయ్య, చలపతి, ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి యూనియన్ నాయకులు రత్నమయ్య, ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.

స్పందించిన కమిషనర్‌కు ధన్యవాదాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జమ్మలమడుగు-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో సర్కిల్ కూడలిలో ఫ్లడ్ లైట్లు వెలగకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం కమిషనర్‌కు వివరించారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన కమిషనర్ వెంకట్రామిరెడ్డికి శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

కర్మాగారాల్లో పరిశుభ్రత తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కర్మాగారాల్లో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం మైదుకూరు రోడ్డులోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఆధార్, ఏషియన్ పివిసి పైప్స్ ఇండస్ట్రీలో, కొర్రపాడు రోడ్డులోని టివిఆర్ పెట్రోల్ బంక్‌లో అవగాహన కల్పించారు. ముందుగా ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో రఘునాథ్ మాట్లాడుతూ ప్రతి ఫ్యాక్టరీలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనారు. పదేళ్లకోసారి విద్యుత్ వైరింగ్ మార్చుకోవడం, ప్రతి ఏడాది నిపుణులతో వైరింగ్ చెక్ చేయించుకొని షార్ట్ సర్క్యూట్ ప్రమాదాల నుండి రక్షణ పొందాలని వివ రించారు. కార్యక్రమంలో ఆధార్ పైప్స్ యజమాని సుదర్శ నరెడ్డి, ఏషియన్ పైప్స్ అధినేత సుబ్బారెడ్డి, టివిఆర్ పెట్రో ల్ బంక్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని వినతి

వేంపల్లె : వేంపల్లెలో ట్రాఫిక్‌పై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని వైసిపి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఉమర్, పులి వెందుల నియో జకవర్గ వైసిపి సేవాదళ్ అధ్య క్షుడు షేక్ రఫీ, అలీ, ఇబ్రహీం సిఐ నరసింహులును కోరారు. ఆ మేరకు వారు శుక్రవారం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో సిఐని కలిశారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా వారు సిఐని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సిఐకి శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం సిఐ వైసిపి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.



సిఐని సత్కరిస్తున్న షేక్ రఫీ

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో వరుస దొంగతనాలతో ప్రజల ఆందోళన చెందుతున్నారని, పోలీసులు అప్రమత్తత కావలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఎన్.వరదరాజురెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాల యంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొద్దిరోజులుగా వరుస దొంగతనాలతో ప్రొద్దుటూరు ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. వీటి నివారణ బాధ్యత పోలీసులదేనని తెలిపారు. దొంగతనాలపై ఎస్‌పితో మాట్లాడానని, తొందర్లోనే నిందితులను పట్టుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ప్రజలు కూడా పోలీసులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు. ఇతర ప్రాం తాలకు వెళ్లే వారు పోలీసులకు విషయం తెలపాలన్నారు. పోలీసు తమ విధు లను సక్రమంగా నిర్వహించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దొంగతనాలు జరగకుండా చూసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పుల్లయ్య, వద్ది బాలుడు, కుతుబుద్దీన్, రామాంజనేయులు పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న మహేశ్వర్ రెడ్డి

టిడిపి సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - చక్రాయపేట

టిడిపి సభ్యత్వ నమోదు కార్డులను శుక్రవారం ఆ పార్టీ మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపిలో కొనసాగుతున్న కార్యకర్తలు సభ్యత్వ నమోదు చేసుకోవడం వల్ల నిరుద్యోగ భృతి, ప్రమాదంలో మృతి చెందితే రూ.5లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదంలో గాయపడివారికి రూ.30 వేలు నుండి రూ.5 లక్షల వరకు వర్తిస్తుందన్నారు. మండలంలో ఇప్పటికే చాలామంది టిడిపి సభ్యత నమోదు చేయించుకున్నారని తెలిపారు. ఆసక్తిగల టిడిపి కార్యకర్తలు సభ్యత్వ నమోదు చెల్లిస్తే కార్డులు వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని టిడిపి కార్యకర్తలు, అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, పలువురు టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అగ్రహారంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ, నాభిశిల పోతురాజు శిఖర కలశ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గుండ్లకుంట శ్రీరాములు అన్నదానం ఏర్పాటు చేశారు.

గోశాలపై చిల్లర రాజకీయాలు తగవు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

తిరుపతిలోని టిటిడి గోశాలపై కొన్ని రోజులుగా అటు వైసిపి, ఇటు టిడిపి కూటమి పార్టీలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని, వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి సూచించారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి, టిడిపి కూటమి పార్టీలకు హిందూ మతం మీద ఏ మాత్రం భక్తి, గౌరవం లేవన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయంగాపై చేయి సాధించాలనే దుర్బుద్ధి తప్ప మరేమీ లేదన్నారు. గోమాతల మృతిపై విచారణ జరిపి వాస్తవాలు ప్రజలకు చెప్పి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూసు కోవాలే తప్ప, దిగజారుడు రాజకీయాలు కట్టి పెట్టాలని తులసిరెడ్డి సూచించారు.

ప్రొద్దుటూరులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తిసర్కిల్)

ప్రొద్దుటూరులో శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో దాదాపు రూ.20వేల ఆస్తి నష్టం జరిగిందని ఫైర్ ఆఫీసర్ రఘునాథ్ తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని పెద్దమ్మ చెట్టు దగ్గర ట్రాన్స్‌పార్మర్ కరెంట్ తీగలపై కోతి పడిందని, మైదుకూరు రోడ్డులోని పిబిఎస్ కాయిర్ అండ్ రోప్ ఇండస్ట్రీలో నిల్వ ఉంచిన కొబ్బరి పీచు, పొట్టు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయ్యాయి.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది